హైదరాబాద్
ఆదివారం
24 నవంబర్ 2024
www.ntnews.com
నమస్తే తెలంగాణ



దాసరి మేఘనా నాయుడు.. ఒక్కపాటతో సోషల్ మీడియాని షేక్‌చేసింది. 'ఏదో అడగనా..' అంటూ ఆమె పాడిన పాట తాను పోటీపడుతున్న షో జడ్జెస్ నుంచి మాత్రమే కాదు, వేరే పాటల కార్యక్రమాల న్యాయనిర్ణేతల నుంచీ ప్రశంసలందించింది. జీ తెలుగు సరిగమప సీజన్ 16 టైటిల్ కోసం పోటీ పడుతున్న మేఘన ఇప్పటికే కొన్ని సినిమాలు, ప్రైవేట్ ఆల్బమ్స్‌లో పాటలు కూడా పాడింది. గీత రచయితగా, మ్యూజిక్ కంపోజర్‌గానూ ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నానని చెబుతున్న ఈ హైదరాబాద్ అమ్మాయి ముచ్చట్లు..

# ఆయన స్పందన ఊహించలేదు

## మేఘనా నాయుడు



**నాకు** చిన్నప్పటి నుంచే పాటలంటే చాలా ఇష్టం. అందుకే నాలుగేళ్ల వయస్సు నుంచే సంగీతం నేర్చుకున్నా. లైట్ మ్యూజిక్ కోసం రామాచారి గారి లిటిల్ మ్యూజిషియన్ అకాడమీలో చేరా. కర్ణాటక సంగీతం శ్రీనిధి మేడమ్ దగ్గర నేర్చుకున్నా. చిన్నప్పటినుంచే స్టేజ్ ఫెర్ఫామెన్స్ ఇచ్చేదాన్ని. ఆరో తరగతిలో ఉన్నప్పుడే మొదటిసారి పాటల పోటీలో పాల్గొన్నా. 'బోల్ బేబీ బోల్' షోతోపాటు, టీటీడీ నిర్వహించిన 'అన్నమయ్య పాటకు పట్టాభిషేకం' కార్యక్రమంలోనూ పాడాను. స్కూల్, కాలేజీ ఫంక్షన్లలోనూ పాటంటే నేనుంటా. చాలా ప్రైవేట్ ఆల్బమ్స్‌లోనూ పాడాను. అనురాగ్ కులకర్ణి గారితో 'పటేల్‌సార్' సినిమాలో పాడాను. 'అలనాటి రామచంద్రుడు'లో కూడా పాడాను. చాలా సినిమాల్లో కోరస్, ట్రాక్.. రికార్డింగ్‌లోనూ గొంతు అందిస్తున్నా. గాయకులంటే అన్నిటికీ ప్రాధాన్యం ఇవ్వాలి. చదువు విషయానికి వస్తే ఇటీవలే డిగ్రీ కంప్లీట్ చేశా. ఇక, నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగా. కాబట్టి పక్కా హైదరాబాద్ అమ్మాయినన్న మాట!



### పాటలు రాస్తా...

లైవ్ ఫెర్ఫామర్, ప్లేబ్యాక్ సింగర్‌గా రాణిస్తూ.. సంగీతాన్నే కెరీర్‌గా చేసుకోవాలనుకుంటున్నా. నా పాటలు నేను రాసుకుని, కంపోజ్ చేసి ఆల్బమ్స్ చేయాలని ఉంది. డాడీ రిటైర్ అయ్యారు. అమ్మ నేను పుట్టినప్పుడే జాబ్ మానేశారు. ఇంట్లో పూర్తి మద్దతు ఉంటుంది. జాబ్ చెయ్యి అని ఫోర్స్ చేయరు. నాకు ఇష్టమైన కెరీర్‌ని ఎంచుకునేందుకు ప్రోత్సహిస్తున్నారు. నా విషయంలో మా కుటుంబం చాలా సంతోషంగా ఉంది. బంధువులు, స్నేహితులు బాగా రిసీవ్ చేసుకుంటున్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను. ఖాళీ సమయాల్లో పాటలు రాసుకుని, కంపోజ్ చేసి పాడుకుంటూ ఉంటాను. చిన్నప్పుడు టీవీల్లో పిల్లల ప్రోగ్రామ్స్ యాంకరింగ్ కూడా చేశాను. కానీ వాటి మీద ఫోకస్ చేస్తే సంగీతంపై ఏకాగ్రత తగ్గుతుందని మానేశా. ఏఆర్ రెహమాన్, ఇళయరాజా వంటి సంగీత దర్శకులతో కలిసి పనిచేయాలనుంది. వాళ్ల సినిమాల్లో ఒక్క పాటైనా పాడే అవకాశం రావాలని కోరుకుంటున్నా.

### కోటిగారు స్పెషల్

కోటిగారు చేసిన సినిమాలు చాలా ప్రత్యేకమైనవి. ఆయన అన్ని రకాల జానర్ సినిమాలు, క్లాసికల్స్, ఫాస్ట్ బీట్స్, మెలోడీస్ చేశారు. అన్ని సంగీత వాయిద్యాలు వాయిస్తారు. అలాంటి వ్యక్తి అందరితోనూ కలిసిపోవడం, సలహాలు, సూచనలు చెప్పడం చాలా గొప్ప విషయం. మోహన్ అన్నకి రూ.5 లక్షలు చెక్ ఇవ్వడం చూసి షాకయ్యా. ఎదుటివాళ్లు కూడా ఎదగాలి అనుకోవడం, కష్టాల్లో ఉన్నారంటే ఆయన వల్ల అయిన సాయం చేయడం నిజంగా ఆయన గొప్పలక్షణాలు. ఎస్పీ శైలజ మేడమ్, కాసర్ల శ్యామ్ గారు కూడా చాలా బాగా గైడ్ చేస్తారు.

### ఆడిషన్స్ ఇస్తాననుకోలేదు

చిన్నప్పటి నుంచి పాడుతూనే ఉన్నా కూడా 'జీ తెలుగు' వల్ల మంచి గుర్తింపు వచ్చింది. సోషల్ మీడియాలో నా పాటకు వచ్చిన స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. నిజానికి సరిగమప 16 ఆడిషన్స్ సమయంలో ఒంట్లో బాలేదు. ఆడిషన్స్ ఇవ్వలేననుకున్నా. ఏదైతే అదవుతుంది, నువ్వు ఆడిషన్ ఇవ్వు... అని దగ్గరి వాళ్లు ప్రోత్సహించడంతో వెళ్లా. సెలెక్ట్ అయ్యా. మొదటి ఎపిసోడ్ నుంచీ నా ఫెర్ఫామెన్స్‌కి జడ్జెస్ ఇచ్చే రెస్పాన్స్ చాలా ప్రోత్సాహంగా ఉంటున్నది. 'ఏదో అడగనా..' పాట నా లైఫ్‌లో చాలా పేరుతెచ్చింది. నా పేరున ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చూసి షాకయ్యా. చంద్రబోస్ గారి లాంటి పెద్దవాళ్లు గుర్తించడం చాలా ఆనందంగా అనిపించింది. అది మాత్రం అస్సలు ఊహించలేదు.

... హరిణి



'పుష్ప అంటే ఫ్లవరనుకుంటివా! ఫైర్..'
అవును! పుష్ప... డైరెక్టర్ సుకుమార్ పెరట్లో పూసిన పువ్వు కాదు. అతని బుర్రలో చెలరేగిన ఫైర్!!
అది ఎంతలా రాజుకుందంటే..
మన స్టైలిష్ అల్లు అర్జున్‌ను.. గ్లోబల్ స్టార్‌గా మండే వరకు వదిలిపెట్టలేదు!

ఇప్పుడు వస్తున్న పుష్ప అట్లాంటి ఇట్లాంటి ఫైర్ కాదు.. వైల్డ్ ఫైర్!
లోకల్ కాదు.. నేషనల్.. ఇంటర్నేషనల్!!
విడుదలకు ముందే... ఈ వైల్డ్ ఫైర్ సెగ బాక్సాఫీస్ పాత రికార్డులకు తాకింది.
ఓ స్మగ్లర్ కథ కోసం ఎందుకంత వెయిటింగ్!
పుష్ప: ద రైజ్‌లో కొంత రీజన్ తెలిసింది. సీక్వెల్‌లో సీరియస్ ఆన్సర్ దొరుకుతుందేమో!
కచ్చితంగా దొరుకుతుంది..
ఎందుకంటే! ఇది సుకుమార్ సినిమా కదా!! అల్లు అర్జున్ హీరో కదా!!



# వరల్డ్ వైల్డ్ ఫైర్

**ము**ందేండ్ల ముందట కేశవుడు చెప్పిన కథ.. పుష్ప. చెప్పించిన వాడు దర్శకుడు సుకుమార్. ఆ కథలో జీవించిన వాడు అల్లు అర్జున్. ఈ స్టయిలిష్ స్టార్ ఇంత రఫ్ లుక్‌లో అప్పటి వరకు ఏ సినిమాలో కనిపించలేదు. కానీ, ఎంత మోటుగా అనిపించినా... మరెంత ఘాటుగా ప్రవర్తించినా.. ప్రేక్షకులు తెగ ఎంజాయ్ చేశారు. సుకుమార్ సృష్టించిన పాత్ర స్వభావం అలాంటిది! తరచి చూస్తే కథానాయకుడికి ఫిజికల్‌గా కొంత లోపమున్నా.. అదీ స్టయిల్‌గా మారిపోయింది. ఆ ఫిజికల్ డిఫెక్ట్‌కు డైరెక్టర్ చూపించిన రీజన్ లాజికల్‌గా కాదు కానీ, ఎమోషనల్‌గా యాప్ట్ అనిపించింది. పచ్చి స్మగ్లర్ కథ. అయితేనేం యాటిట్యూడ్‌తో అతణ్ని హీరోను చేశాడు. ఇంతటి విధ్వంస రచనలోనూ సుకుమార్ లెక్క తప్పలేదు. సినిమాలో ఒక్క చెట్టూ నేలకూలదు. ఒక్క చోట.. ఓ చెట్టు మొదలుపై గొడ్డలి పోటు సుతారంగా తాకినట్టు కనిపిస్తుందంతే!

**చెట్టును** పొట్టన పెట్టుకున్న పుష్పను ప్రేక్షకులు కోపగించుకోలేదు సరికదా... ఆసక్తిగా చూశారు. ఎర్ర చందనం దుంగలు పోలీసుల కంట పడకుండా తెలివిగా తప్పించిన అతని తెలివికి అబ్బురపడ్డారు. శ్రీవల్లిని తెగ ప్రేమించిన వైనానికి మురిసిపోయారు. మోటు సరసానికి రమ్మని.. గౌరవంగా పంపించిన తీరుకు ముచ్చటపడ్డారు. 'చూపే సింగారమాయనే..' అంటూ చెప్పు ఊడగొట్టుకొని స్టెప్పేసినా ఊగిపోయారు. గల్లీ పోరగాళ్లు మాత్రమే కాదు.. సిడ్నీ సిన్నోడు వార్నర్ సైతం.. 'తగ్గేదే లే' అని చిందేశాడు. పుష్ప గడ్డం సవరించుకున్న తీరుకూ ఫిదా అయ్యారు. పొలిటికల్ పంచ్‌లకూ వాడేశారు. అంతెందుకు, అప్పటి వరకు చూడబుద్ధికాని గుబురు గడ్డాలు కూడా.. పుష్ప మానియాతో తెగ ముద్దొచ్చేశాయి. మరీ ముఖ్యంగా పార్ట్ టూలో శ్రీవల్లి పాదపంకజం పుష్ప గడ్డాన్ని సవరించిన తీరును ప్రాక్టికల్‌గా ఎంత మంది పాటిస్తారో.. సామాజిక మాధ్యమాల్లో ఎన్నిరీల్స్‌కు దారితీస్తుందో చూడాలి.

**ఇప్పుడు** ద రూల్‌కి వద్దాం. పుష్పకు మద్దతుదారులు ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? అతను ఎందుకు కనిపించకుండా పోయాడు? పుష్ప ఆచూకీ గల్లంతు అయితే.. నెల రోజులు అల్లర్లు చెలరేగేంతలా అతనేం చేశాడు? 'సంపాదించిన దుడ్డు ఏం చేస్తున్నారో చెప్తున్నారా?' అని ఓ పెద్దాయన మాటలకు, పుష్పకు లింకేంటి? అప్పుడెప్పుడో విడుదలైన టీజర్ విసిరిన ప్రశ్నలివి. వీటన్నిటికీ సుకుమార్ చూపించే సమాధానం ఎట్లా ఉండబోతున్నదో? టీజర్‌లో పులిని రెండడుగులు వెనక్కి వేయించి పుష్ప దమ్మును తెలియజెప్పిన డైరెక్టర్.. ఈ సినిమాతో ఐకాన్ స్టార్ అభిమానులను పది అడుగులు ముందుకు వేసేలా చేయబోతున్నాడని అనుకోవచ్చేమో!

**తెలుగు** వెండితెరపై 'జగడం' నుంచి మొదలైన సుకుమార్ మార్క్.. రిమార్క్ లేకుండా సాగిపోయింది. ఆర్య, ఆర్య 2 సినిమాల్లో డిఫరెంట్ బన్నీని చూపించాడు. సుకుమార్ లెక్క, బన్నీ ఫిజిక్ పక్కాగా కలిసిన చిత్రం పుష్ప. లెక్కలొచ్చినోడికి ఫిజిక్స్ సబ్జెక్టు అంటే వల్లమాలిన అభిమానం ఉంటుంది. అంతకు ముందు 'నాన్నకు ప్రేమతో'లో వేగం, త్వరణం, కోణం ఇలా మ్యాథ్స్‌ను, ఫిజిక్స్‌ను కలిపి హీరోతో విలన్లను స్టయిల్‌గా కొట్టించిన సుకుమార్.. పుష్ప-2లో విచ్చలవిడిగా ప్రయోగాలు చేసినట్టు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది. బౌండెడ్ స్క్రిప్ట్ అన్నది చరిత్ర పాఠాలు చెప్పే మాస్టార్ల పద్ధతి. కానీ, ఈ మ్యాథ్స్ పండితుడి తీరే వేరు! ఒక్క ఈక్వేషన్‌కి వందల ఎగ్జాంపుల్స్ ప్రాక్టీస్ చేయించడం ఈ సారు మాడల్. ట్యూషన్ మాస్టార్ అనుభవమో ఏమో కానీ, సీన్ బెటర్‌గా రావడం కోసం స్క్రిప్ట్‌ను ఎన్ని రకాలుగా మార్చడానికైనా సుకుమార్ సిద్ధం. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బన్నీ చెబుతూ 'నేను ఈ రోజు రాసుకుంటా డార్లింగ్.. ఇవాళ్టి షూట్ రేపు ప్లాన్ చేద్దామా' అనేవాడట సుకుమార్! స్క్రిప్ట్‌లో బెటర్‌మెంట్ కోసం సెట్స్‌లోనూ తపస్సు చేసేవాడని ఈ మాటలతో అర్థమవుతుంది.

**మ్యాజిక్** ఉన్న చోట లాజిక్‌కు చోటు ఉండదని సినీ పండితుల విశ్లేషణ. కానీ, ఎంత మ్యాజిక్ చేసినా.. లాజిక్ మిస్సవ్వకుండా జాగ్రత్తపడతాడు సుకుమార్. అల్లు అర్జున్ ఎన్ని విన్యాసాలు చేసినా ప్రేక్షకులు యాక్సెప్ట్ చేస్తారు. ఎందుకంటే స్టయిలిష్ స్టార్‌గా ఆయన యాక్షన్ కూడా క్లాస్‌గా ఉంటుంది. ఈ

ఒక్కడు చాలదన్నట్టు అతని చుట్టూ భారీ తారాగణం. ఎవరి రేంజ్ వారిది. ఫహాద్ ఫాజిల్ తక్కువోడా! పుష్ప ఒకటప్పటికే అతను ఇంట గెలిచాడు. సీక్వెల్ సిద్ధమవుతున్న తరుణానికి రచ్చ కూడా గెలిచి టాప్‌గేర్‌లో ఉన్నాడు. పార్ట్ వన్‌లో దెబ్బతిన్న భన్వర్‌సింగ్ షెకావత్ రెండో భాగంలో ఎలా రెచ్చిపోతాడో చూడాలి! సిద్ధప్పనాయుడుగా రావు రమేశ్ పుష్ప పక్కనే ఉంటాడా, పరాయి పంచన చేరుతాడా అన్నది ఆసక్తికరం. ఎందుకంటే మరో దిగ్గజం స్క్రిప్ట్‌లోకి చొరబడటమే! అదెవరో కాదు జగపతిబాబు! తాజా ట్రైలర్ ఆయన డైలాగ్‌తోనే మొదలు కావడం ఆ పాత్ర రేంజ్ చెప్పకనే చెబుతున్నది. ఇక మంగళం సీను, అతని భార్య దాక్షాయణి, పుష్ప దెబ్బకు కుదేలైన జక్కారెడ్డి ఏ ఉచ్చు పన్నుతారో తెలియదు! ప్రేమికుడిగా శ్రీవల్లిని అలరించిన పుష్ప.. పెనిమిటిగా ఎలా పెనవేసుకుంటాడో ఇంట్రెస్టింగ్ అంశం. పుష్ప తండ్రి వారసులు అతణ్ని అంతే దూరం పెడతారో, అక్కున చేర్చుకుంటారో చూడాలి! మొత్తంగా గ్రాండ్‌నెస్‌లో ఎక్కడా 'తగ్గేదే లే' అన్నట్టుగానే సినిమా ఉండబోతున్నదని ఇండస్ట్రీ టాక్! భారీగా పెరిగిన అంచనాలకు ఇంచు కూడా తక్కువ లేదని ట్రైలర్ చెప్పింది. వీటికితోడు పార్ట్ వన్‌లో 'ఉహ్వా అంటావా మామా...' అంటూ అందరితో ఊ కొట్టించిన పాటకు దీటుగా కిస్సిక్ సాంగ్ ఎంత కిక్కు ఇస్తుందో ఈరోజు రాత్రికే తేలిపోనుంది.

**ఇక** పుష్ప టీజర్‌లో అందరినీ ఆశ్చర్యపర్చింది.. అల్లు అర్జున్ లేడీ గెటప్. సినిమాలో కథా వస్తువు ఒకటే ప్రధానం కాదు! ఆ కథ సాగుతున్న ప్రాంతానికీ అంతే ప్రాధాన్యం ఉంటుంది. శేషాచలం కొండల్లో నడిచే ఈ కథలో తిరుపతిలో జరిగే గంగమ్మ జాతరను ఇన్‌వాల్వ్ చేయడం దర్శకత్వ ప్రతిభే! కథనంలో మేలైన మలుపునకు ఈ జాతర వేదిక అవుతుందని విశ్లేషకుల మాట. సినిమా విడుదలయ్యాక ఆ సంగతి తెలుస్తుంది కానీ, పాలెగాన్ని సంహరించిందన్న పేరున్న గంగమ్మ సన్నిధిలో పుష్ప వీరంగం ఎవరి సంహారానికో తేలాల్సి ఉంది. పార్ట్ వన్‌లో పాత్రలు చిత్తూరు యాసతో మత్తు జల్లితే.. రెండో పార్టులో ఓ ప్రధాన పాత్ర కడప స్లాంగ్‌తో కదనానికి కాలుదువ్వినట్టు అనిపిస్తుంది. ప్రతి అంశాన్నీ కూలంకషంగా పరిశీలించే సుకుమార్ కథ జరిగే ప్రాంతాన్ని, అక్కడి వేషభాషల్ని, యాసల్ని చూపించడానికి పెద్ద కసరత్తే చేశాడేమో! పార్ట్ వన్‌కు స్ట్రాంగ్ పాయింట్‌తో ముగింపు పలికిన దర్శకుడు... రెండో పార్ట్‌ను ఎలా ఎత్తుకుంటాడన్నది చర్చనీయాంశం. దానికి ఎలాంటి ముగింపు ఇస్తాడన్నది ఆసక్తికరం.

**చివరిగా...**
పార్టీ లేదా పుష్ప.. అప్పుడు!
పార్టీ ఉంది పుష్ప.. ఇప్పుడు!
ఏ పార్టీ లేనప్పుడే.. ఇరగదీశాడు పుష్ప.
పార్టీ ఉందంటే.. ఇక ఏ రేంజ్‌లో ఉంటుందో ఊహించుకోవచ్చు.



... కణ్వస


## అసలేం జరిగింది?

ఓటీటీ హిట్

### ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్

**సోనీ లివ్:** స్ట్రీమింగ్ అవుతున్నది
**నటీనటులు:** చిరాగ్ వోహ్రా, సిద్ధాంత్ గుప్త, రాజేంద్ర చావ్లా, ఆరిఫ్ జకారియా
**దర్శకుడు:** నిఖిల్ అడ్వాణీ

చరిత్రను పెనవేసుకున్న గాథలు ఓటీటీలో ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా సోనీ లివ్ చేస్తున్న వెబ్ సిరీస్ ప్రయోగాలు ప్రేక్షకులను విపరీతంగా ఎంగేజ్ చేస్తున్నాయి. హర్షద్ మెహతా స్టాక్‌మార్కెట్ కుంభకోణంపై నిర్మించిన 1992 స్కామ్, స్వతంత్ర భారతంలో తొలితరం శాస్త్రవేత్తలు సతీశ్ ధావన్, హోమీ భాభా జీవిత చరిత్రల ఆధారంగా నిర్మించిన రాకెట్ బాయ్స్, తెల్గీ స్కామ్ వెబ్ సిరీస్‌లు.. సోనీ లివ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. తాజాగా ఇదే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై విడుదలైన 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' కూడా రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించే క్రమంలో దేశవిభజనకు దారి తీసిన పరిణామాలు, అప్పుడు జరిగిన రాజకీయ ఎత్తుగడల నేపథ్యంలో ఈ సిరీస్ నిర్మించారు. ఏడు ఎపిసోడ్లు ఆసక్తికరంగా సాగుతాయి.



జవహర్‌లాల్ నెహ్రూ (సిద్ధాంత్ గుప్తా), సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ (రాజేంద్ర చావ్లా), మహాత్మా గాంధీ (చిరాగ్ వోహ్రా), ముహమ్మద్ అలీ జిన్నా (ఆరిఫ్ జకారియా) ప్రధాన పాత్రలుగా కనిపిస్తారు. గాంధీ, నెహ్రూ, పటేల్ మధ్య జరిగే చర్చలు ఆసక్తికరంగా సాగుతాయి. స్వతంత్ర భారతదేశం కోసం పోరాడిన ఈ ముగ్గురి దృక్పథాల్లో ఎలాంటి వైవిధ్యం ఉన్నదో ఈ సిరీస్ చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ముస్లిం లీగ్ ప్రతినిధిగా, మతం ప్రాతిపదికన దేశాన్ని విభజించాలన్న జిన్నా డిమాండ్ చేయడంతో కథ రసవత్తరంగా మారుతుంది. ముఖ్యంగా ఈ సిరీస్ 1940ల నాటి భారతదేశానికి అద్దం పట్టింది. కథనం అక్కడక్కడా నెమ్మదించినా భావోద్వేగంగా ఉంటుంది. 1944-47 మధ్య జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యాన్ని ఎంచుకొని దానిని పకడ్బందీగా చూపించడంలో దర్శకుడు నిఖిల్ అడ్వాణీ కృతకృత్యుడు అయ్యాడు. అయితే చరిత్రపై పూర్తి అవగాహన ఉన్నవాళ్లకే ఇందులోని లోటుపాట్లు అర్థమవుతాయి. సాధారణ ప్రేక్షకులకు మాత్రం ఓ ఇంట్రెస్టింగ్ సిరీస్! కాకపోతే, కొత్త విషయాలు తెలుసుకున్నామన్న సంతృప్తి మిగులుతుంది.



## నా బ్యూటీ సీక్రెట్ ఇదే!

**బాలీవుడ్** భామ దీపికా పదుకొణె అమ్మదనాన్ని ఎంజాయ్ చేస్తున్నది. తన గారాలపట్టి దువాతో కాలమే తెలియడం లేదని చెబుతున్నది. గర్భం ధరించినప్పటి నుంచి మీడియాకు దూరంగా ఉంటున్న దీపిక.. సామాజిక మాధ్యమాల్లోకి తరచూ తొంగిచూస్తున్నది. తన అప్‌డేట్స్ అన్నీ ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంటున్నది. 'తల్లి అయిన తర్వాత మీ సౌందర్యాన్ని ఎలా కాపాడుకుంటున్నారు' అని కొందరు నెటిజన్లు వేసిన ప్రశ్నకు దీపిక ఫన్నీ జవాబు చెప్పింది. ఒక వ్యక్తి నీళ్లు ముఖంపై చల్లుకున్న వీడియోను షేర్ చేస్తూ.. ఇదే నా స్కిన్ కేర్ బ్యూటీ సీక్రెట్ అంటూ కామెంట్ చేసింది. ఈ పోస్టు సరదా కొద్దీ చేసిందో, తను అదే పాటిస్తున్నదో తెలియక రకరకాల కామెంట్లు చేస్తున్నారు నెటిజన్లు.

## వలయాలను వెచ్చగా తరిమేద్దాం

**వయసు** పెరిగే కొద్దీ వచ్చే ముఖంపై ముడతలు, కండ్ల కింద వలయాలు వచ్చి అందాన్ని దూరం చేస్తాయి. ఈ ముడతలను, ఆ వలయాలను గోరువెచ్చని నీళ్లు తరిమికొడతాయి.

- వెడల్పాటి గిన్నెలో గోరువెచ్చని నీళ్లు పోసి.. అందులో 20 సెకండ్లపాటు ముఖాన్ని ఉంచండి. శ్వాస తీసుకోవడం ఇబ్బంది అయితే, పదేసి సెకండ్ల చొప్పున రెండు, మూడుసార్లు ముఖం అంతా మునిగేలా తలను నీళ్లలో ఉంచాలి. తర్వాత మెత్తటి వస్త్రంతో ముఖాన్ని తుడుచుకోవాలి.
- గోరువెచ్చని నీళ్లతో ముఖం కడగడం వల్ల చర్మం తాజాగా మారి ముడతలు తగ్గుముఖం పడతాయి. మొటిమలు, మచ్చలు కూడా తగ్గతాయి. రక్తప్రసరణ మెరుగై చర్మం మెరుస్తుంది.
- గోరువెచ్చని నీళ్లు చర్మంపై ఉండే మృతకణాలను తొలగిస్తాయి. దుమ్ము, ధూళి, మేకప్ వల్ల మూసుకుపోయిన స్వేదరంధ్రాలను తెరుస్తాయి. ఫలితంగా చర్మానికి మంచి నిగారింపు వస్తుంది.